ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

జనవరి 2014

₹10





ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 71 సంచిక: 1 జనవరి 2014

**నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః ।**
**నమః పద్మ ప్రబోధాయ మార్తాండాయ నమో నమః ॥**
**తప్తచామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే ।**
**నమస్తమోఽభి విఘ్నాయ రవయే లోకసాక్షిణే ॥**

ఉగ్రుడవు, వీరుడవు, వేగంగా పయనించునట్టివాడవు అయిన నీకు నమస్కారం. పద్మములను వికసింపజేయు నీకు నమస్కారం. బ్రహ్మాండ పునఃసృష్టికి హేతువైన నీకు నమస్కారం. కరిగిన బంగారు వన్నెగలవాడవు, అగ్ని రూపుడవు, జగత్కారణుడవు, అంధకారాన్ని పోగొట్టువాడవు, ప్రకాశస్వరూపుడవు, లోకసాక్షివి అయిన నీకు నమస్కారం. – ఆదిత్యహృదయం



## స్వామీజీకి ఘననివాళి

స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని 2013 జనవరి సంచిక నుంచి 2014 జనవరి సంచిక వరకు 'శ్రీరామకృష్ణ ప్రభ' స్వామీజీ ముఖచిత్రంతో, ప్రత్యేకవ్యాసాలతో పాఠకులను అలరించిందని భావిస్తున్నాం.

ఈ పదమూడు సంచికల్లో మహాజ్ఞాని, మహాభక్తుడు, మహాయోగి, మహాప్రవక్త, మహాదేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, యతిశ్రేష్ఠుడు, యుగాచార్యుడు, స్ఫూర్తిప్రదాత అయిన స్వామి వివేకానంద జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశించే ప్రయత్నం చేశాం. స్వామీజీకి సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలనూ, బోధనలనూ, సంఘటనలనూ, స్మృతులనూ, సూక్తులనూ, వారి సందేశంతో ప్రభావితులైన మహోన్నతుల అనుభూతులనూ ప్రచురించాం. ఆ మహాప్రవక్తకు పదమూడు నెలల పాటు అక్షరాంజలిని అర్పించి, స్మరించుకొనే భాగ్యానికి నోచుకున్నాం.

స్వామీజీకి సంబంధించిన ఈ ప్రత్యేక వ్యాసాల ద్వారా పొందిన స్ఫూర్తితో ఆయన ఆశయాలకు అనుగుణంగా మన జీవితాలను తీర్చిదిద్దుకొందాం. అదే ఆ మహనీయునికి మనం అర్పించగల ఘననివాళి. ❖ – సంపాదకులు

## లోపలి పేజీల్లో...


4 సంపాదకీయం
ఎటో వెళ్ళిపోతోంది యువత!

6 గోరుముద్ద
సాగిపో... నేస్తమా!

7 సందడిగా సంక్రాంతి లక్ష్మి

8 భజ గోవిందమ్... భజ గోవిందమ్
ముక్తి ప్రాప్తించుగాక!

10 ఆనందమే ఆధ్యాత్మికత

11 వివేకానంద సూక్తి సుధ, వివేకానంద క్విజ్

13 కామధేనువిదే... కల్పవృక్షమిదే

14 పరిప్రశ్న

15 ఆచార వ్యవహారాలు-అంతరార్థాలు
ఎవరికి నమస్కరించాలి?

16 నాటికీ నేటికీ నిజనాయకుడే!

18 దివి నుండి దిగివచ్చిన దివ్యతేజం

19 ధీరవాణి
కలల్లో నుండి లేచి కళ్ళు తెరవండి!

20 విభిన్నపార్శ్వాల విశిష్ట వ్యక్తిత్వం

22 వివేక దీప్తి
మాననీయుని మహాప్రస్థానం

24 జయహో వీర నరేంద్ర!
జయహో విశ్వ వివేకానంద !!

26 ఎవరికీ తలవంచకు

28 నిప్పును చల్లార్చేది నీళ్ళే!

29 పనికి ముందుందాం!

31 ముందుకు సాగిపో!

33 పదహారేళ్ళకే ప్రధానోపాధ్యాయుడు!

34 భగవద్గీత - సద్గుణ సుధ
నిర్జనవాసంలో నిర్మలత్వం

36 బొమ్మల కథ
పండితుడైన మూర్ఖుడు


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

### శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

*ప్రియ పాఠకులారా!*

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

**'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ http://kinige.com/srkp ద్వారా చెల్లించవచ్చును.**

# ఎటో వెళ్ళిపోతోంది యువత!



'ప్రపంచంలో ఏ దేశానికీ లేని యువశక్తి కేవలం భారతదేశానికే ఉంది. అది మనకు గొప్ప వరం. కానీ, ఆ వరమే మన దేశానికి శాపంగా పరిణమిస్తోంది' అని మేధావి వర్గమంతా మథనపడుతూ ఉంది. నిజానికి యువతరం మన దేశానికి వరమా? లేక శాపమా? పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే యువశక్తి హద్దులు దాటితే వినాశనాన్ని సృష్టిస్తుంది. అదే యువశక్తిని మార్గనిర్దేశం చేసి, సన్మార్గంలో పయనింపజేస్తే పురోగమనానికి సోపానమవుతుంది.

'యువతరం – సినిమా, టీవీ, సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ మొదలైన ఆధునిక ఆకర్షణల మోజులో పడి పెడదోవ పడుతోంది. దురలవాట్ల సునామీలో కొట్టుకుపోతోంది' అని యువతరాన్ని విమర్శించేవాళ్ళేగానీ, వారిని సంస్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామని ఆలోచించేవారు అరుదు.

**తప్పుపట్టడం కాదు, ఒప్పేమిటో చెప్పు!** చేతికి దొరికిన కాగితాన్నల్లా చింపేయడం ఓ నాలుగేళ్ళ పిల్లవాడికి అలవాటు. కరెన్సీ నోటు చేతిలో పడినా అదే తీరు. తల్లితండ్రులు ఎంత తిట్టినా, ఎంత కొట్టినా అతడి అలవాటు మాత్రం మారలేదు. పిల్లవాడి వింత చేష్టను మాన్పించలేని తల్లితండ్రులు, ఒక మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్ళి విషయం చెప్పారు.

మానసిక వైద్య నిపుణుడు ఆ పిల్లవాణ్ణి గదిలోకి తీసుకువెళ్ళి, ఓ ఐదు నిమిషాల తరువాత తిరిగి తీసుకువచ్చాడు. అబ్బాయి తల్లితండ్రులతో ఆ వైద్యుడు 'ఇప్పుడు మీ అబ్బాయికి కరెన్సీనోటు ఇవ్వండి' అని చెప్పాడు. ఐదు వందల రూపాయల నోటును ఆ అబ్బాయి చేతిలో పెట్టారు. ఆ అబ్బాయి ఆ నోటును చింపకుండా తిరిగి తల్లితండ్రులకు ఇచ్చేశాడు. "ఎన్నో రోజులుగా మేము మాన్పించలేని అలవాటును మీరెలా మాన్పించగలిగారు?" అని తల్లితండ్రులు ఆశ్చర్యంగా అడిగారు. అప్పుడు వైద్యుడు "మీరు ఇన్నాళ్ళూ కాగితాన్ని చింపొద్దు అని మాత్రమే చెప్పారు. కానీ నేను కాగితాన్ని ఎందుకు చింపకూడదో చెప్పాను. ఈ కాగితం (కరెన్సీ నోటు)తో దుస్తులు, చాక్లెట్లు, ఆటవస్తువులు కొనుక్కోవచ్చని చెప్పాను" అని సమాధానమిచ్చాడు.

అందువల్ల తప్పు చేశారంటూ పిల్లల్ని నిందించడంతో సరిపెట్టకుండా, వారికి ఉన్నత విలువలను బోధించాలి. అందుకే **"పిల్లల్ని 'మీరు చెడ్డవారు, ఎందుకూ పనికిరారు' అని నిందించవద్దు. 'మీరు మంచివారు, ఇంకా మంచివారిగా తయారుకావాలి' అని ప్రోత్సహించాలి. వారిలో సకారాత్మక, స్ఫూర్తిదాయక ఉన్నత భావాలను పెంపొందింపజేయాలి"** అని అంటారు స్వామి వివేకానంద.

**వెలుగుబాట వైపు యువ సారథులు:** 'మంచిమాటలు చెబితే నేటితరం పిల్లలు వింటారా?' అని నిరుత్సాహాన్ని వ్యక్తపరిచేవాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ ఈ అపోహ నిజం కాదు. యువతకు సన్మార్గంలో నడవాలనీ, తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనీ ఆసక్తీ, తపనా, ఉత్సాహం ఉన్నాయి. అందుకు నిదర్శనంగా స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని సుమారు పదహారు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన 'వివేకానంద రథయాత్ర' సభల్లో పాల్గొన్న కొంతమంది విద్యార్థినీ విద్యార్థుల స్పందన, నిజజీవిత అనుభవాలూ కొన్నింటిని ఇక్కడ తెలియజేస్తున్నాం:

ఒక ఊరిలో రోడ్డు పక్కన ఉన్న సంచార పుస్తక విక్రయశాల వద్ద చాలా మంది వివేకానంద పుస్తకాలు కొనుక్కుంటున్నారు. అదే దోవలో వెళుతున్న ఒక కళాశాల విద్యార్థి అక్కడ ఆగి చాలాసేపు ఏదో ఆలోచిస్తూ నిలబడ్డాడు. అతణ్ణి చూసిన ఓ కార్యకర్త "ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అని అడిగాడు. అందుకు ఆ విద్యార్థి "నా దగ్గరున్న ఇరవై రూపాయలతో సినిమా చూడడానికి వెళ్ళాలా? లేక వివేకానంద పుస్తకాలు కొనుక్కోవాలా? అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

అప్పుడు ఆ కార్యకర్త "సినిమా రేపైనా చూడొచ్చు. నువ్వు ఒక్కసారి 'భారతజాతికి నా హితవు' అనే స్వామి వివేకానంద పుస్తకాన్ని చదువు" అని సలహా ఇచ్చాడు. అతడు చెప్పిన ప్రకారం ఆ విద్యార్థి పుస్తకాన్ని కొనుక్కొని ఇంటికి వెళ్ళి, చదివిన తరువాత మళ్ళీ అక్కడకు వచ్చి ఇంకో వంద రూపాయలతో స్వామి వివేకానంద జీవిత చరిత్ర, మరికొన్ని పుస్తకాలను కొని, 'ఈ రోజు మీ సలహా పాటించి ఉండకపోతే ఎంతో విలువైన సందేశాన్ని కోల్పోయి ఉండేవాణ్ణి' అంటూ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపాడు.

ఒక నగరంలో పాఠశాల విద్యార్థులను ఉద్దేశిస్తూ ఓ స్వామీజీ,'మీరంతా వివేకానంద సూక్తిని రోజుకు ఒక్కటైనా పఠించండి. అప్పుడు మీలో ఏకాగ్రత, శ్రద్ధ పెరుగుతాయి' అని సూచించారు. ఆ సభలో 8వ తరగతి చదువుతున్న ఓ అమ్మాయి, స్వామీజీ సూచన ప్రకారం రోజూ వివేకానంద సూక్తులను పఠించడం మొదలుపెట్టింది. అప్పటి వరకూ అల్లరి చిల్లరగా తిరిగిన ఆ అమ్మాయి ఉదయాన్నే లేచి దైవ ప్రార్థన చేస్తోంది. శ్రద్ధగా చదువుకుంటోంది. అమ్మాయిలో హఠాత్తుగా వచ్చిన ఈ మార్పును గమనించిన ఆమె తల్లితండ్రులు 'నీలో ఇంత మార్పు ఎలా వచ్చింది?' అని అడిగారు. అందుకు 'స్వామి వివేకానంద బోధలే నాలో పరివర్తనకు కారణం. మీరు నాకు స్వామీజీ గురించి ఇంతవరకు ఎందుకు చెప్పలేదు?' అంటూ తల్లితండ్రులను ప్రశ్నించింది ఆ చిన్నారి.

ఒక గ్రామంలో జరిగిన విద్యార్థుల సదస్సులో 2,000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. తరగతి గదిలో 45 నిమిషాల పాటు కూడా నిశ్శబ్దంగా ఉండలేని విద్యార్థులు ఆ సభలో సుమారు మూడు గంటల పాటు స్వామి వివేకానంద బోధించిన ఆత్మవిశ్వాసం, మనోనిగ్రహం, కార్యదీక్ష, ఆత్మస్థైర్యం, సేవ, త్యాగాల గురించి వింటూ తన్మయులైపోయారు. ఆ సభ చివరిలో విద్యార్థినీ విద్యార్థులు తమ స్పందన తెలియజేశారు. అందులో ఒక వికలాంగ విద్యార్థి మాట్లాడుతూ, "స్వామి వివేకానంద స్ఫూర్తితో జీవితంలో దేనినైనా సాధించవచ్చు అన్న సంకల్పబలం నాలో పెరిగింది. స్వామీజీ సందేశాన్ని మాకు పరిచయం చేయకపోవడం వల్లనే వెనుకబడిపోయాం అనుకుంటున్నాం. స్వామీజీ సందేశాన్ని చదివినవారిలో ఎలాంటి బలహీనతలనైనా ఎదుర్కోగలశక్తి కలుగుతుంది అని నా ప్రగాఢ విశ్వాసం" అని చెమ్మగిల్లిన కళ్ళతో నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపాడు.

**మనోరుగ్మతలకు మందు:** "మనోరుగ్మతలకు స్వామీజీ సందేశం ఓ దివ్య ఔషధం. ఆయన బోధలు చదివినవారిలో నిరాశా నిస్పృహలు తొలగి ఆత్మస్థైర్యం పెంపొందుతుంది" అని స్వామీజీ సందేశానికి ఉన్న శక్తిని పండిట్ నెహ్రూ శ్లాఘించారు.

ఒక పట్టణంలో రథయాత్రలో పాల్గొన్న ఒక విద్యార్థి, ఓ స్వామీజీతో 'స్వామీజీ! నేను స్వామి వివేకానంద సాహిత్యాన్ని చాలా చదివాను. స్వామీజీ గురించి ఇంకా తెలుసుకోవాలని ఉంది. ఇప్పుడు కొత్త పుస్తకాలు ఏమైనా ఉన్నాయా?' అని అడిగాడు. ఆ విద్యార్థితో స్వామీజీ, 'స్వామీజీ సాహిత్యాన్ని చాలా చదివావు కదా! స్వామీజీ సందేశ సారాంశాన్ని ఒక్క వాక్యంలో చెప్పు' అని అన్నారు. 'స్వామి వివేకానంద బోధనలు చదివితే పక్షవాతం వచ్చినవారిలోనైనా పరుగెత్తగలనన్న ఆత్మవిశ్వాసం కలుగుతుంది. మానసిక వైకల్యం తొలగి పోతుంది' అని పెల్లుబికిన ఉత్సాహంతో బదులిచ్చాడు.

ఒక విద్యార్థుల సభలో ఓ మంత్రి గారు పాల్గొన్నారు. ఆ సభలో ఓ స్వామీజీ, పిల్లలతో వివేకానంద సూక్తులను చెప్పించారు. వివేకానందుల జీవితంలోని స్ఫూర్తిదాయక సంఘటనలను వివరించారు. ఆ తరువాత మంత్రిగారు మాట్లాడుతూ, "మానసిక బలహీనతలను పారద్రోలే స్వామీజీ దివ్యసందేశాన్ని ఆస్వాదించిన మీరందరూ నిజంగా ధన్యులు. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు స్వామీజీ గురించి వినే భాగ్యం నాకు కలగనందుకు బాధపడుతున్నాను. జీవితంలో నేను ఏం కోల్పోయానో ఇప్పుడు అర్థమైంది. కాబట్టి ఇక నుండి స్వామీజీ సాహిత్యాన్ని చదువుతాను" అని ఆర్ద్రమైన హృదయంతో చెప్పిన మాటలు విద్యార్థుల మనస్సులను కదలించాయి.

**యువతరానికి మార్గదర్శి... యువ నాయకుడు:** ప్రపంచంలో స్వామి వివేకానందకున్న యువ అనుచరులు, అనుయాయులు మరెవరికీ లేరు. ఎందుకంటే స్వామీజీ భారతీయ యువతరానికి ఇచ్చినంత స్ఫూర్తిని మరెవ్వరూ ఇవ్వలేదు. యువతరం ఉన్నతి గురించి స్వామీజీ తపించినంతగా ఎవరూ తపించలేదు. యువతరంపై ఆయనకున్న విశ్వాసం మరెవరికీ లేదు. అందుకే, "నా ఆశలన్నీ యువతరం పైనే, ఆధునిక తరం పైనే! సింహాల్లా పోరాడి వారి సమస్యలను వారే పరిష్కరించు కోగలుగుతారు" అని స్వామీజీ అన్న మాటలే యువతరంపై ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనం.

యువతరానికి స్ఫూర్తిప్రదాత, ప్రేరణదాత స్వామీజీయే అని ముక్తకంఠంతో చాటిన మహాత్ముల్లో కొందరి అభిప్రాయాలు:

**"స్వామి వివేకానంద తన ప్రసంగాల ద్వారా విద్యార్థుల్ని ప్రభావితం చేసినట్లు దేశంలో ఏ ఇతర నాయకులూ చేయలేదు. ఆయన బోధలు చదివితే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందుతాయి."**

*- నేతాజీ సుభాష్ చంద్రబోస్*

**"నా విద్యార్థి దశలో స్వామి వివేకానంద బోధలు చదివి ఎంతో స్ఫూర్తి పొందాను. ఆయన బోధలు నా జీవిత దృక్పథాన్నే మార్చేశాయి."**

*- లాల్ బహదూర్ శాస్త్రి*

**"స్వామీజీ బోధనలు స్పృశిస్తేనే చాలు నా దేహం విద్యుద్ఘాతం తగిలినట్లుగా ప్రకంపిస్తుంది. ఆయన బోధలు మనలో నిద్రాణమై ఉన్న ఆత్మశక్తిని జాగృతం చేస్తాయి."** *- రోమారోలా*

**"శక్తికి కేంద్రమైన స్వామి వివేకానంద నుండి భారత యువత స్ఫూర్తిని పొంది, ఉన్నతి సాధించాలని ఆశిస్తున్నాను."** *- జవహర్ లాల్ నెహ్రూ*

యువతకు మార్గదర్శి యువ నాయక వివేకానందే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే భారత ప్రభుత్వం స్వామి వివేకానంద జన్మదినమైన (ఆంగ్ల తేదీ ప్రకారం) జనవరి 12వ తేదీని 'జాతీయ యువజన దినోత్సవం'గా 1985లో ప్రకటించింది. అప్పటి నుంచి ఏటా ఆ తేదీన యువజన దినోత్సవం జరుపుకొంటున్నాం.

ఏ దేశంలోనూ లేనంతటి యువశక్తి మన దేశంలో ఉంది కాబట్టే ఆ యువశక్తిని జాగృతం చేయడానికి స్వామి వివేకానంద భారతదేశంలో ఆవిర్భవించారు.

ఇప్పుడు తల్లితండ్రులూ, ఉపాధ్యాయులూ, విద్యావేత్తలూ, ఉన్నతాధికారులూ, నాయకులూ చేయాల్సింది ఏమిటంటే **'ఎటో వెళ్ళిపోతోంది యువత'** అని కలతచెందకుండా స్వామీజీ భావాల్ని భావిపౌరులకు అందేలా కృషిచేయాలి. అప్పుడు యువత మన దేశానికి సిసలైన వరంగా పరిణమిస్తుంది. ❖

**పిల్లలకు ఉన్నత భావాలను బోధించండి. ఇప్పుడు మనం వారికి చేయాల్సిన సహాయం ఇదే! తరువాత వారి జీవితాలలో దాని ప్రభావం సహజంగానే ప్రతిఫలిస్తుంది.** *-స్వామి వివేకానంద*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2477**

* * *